క్లుప్తంగా

మూడో విడత అడ్మిషన్లు ప్రారంభం

నిడదవోలు: నిడదవోలు ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో విడత ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకూ అడ్మిషన్లు పొందే అవకాశం ఉందన్నారు. బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథ్స్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా కానూరు సర్పంచ్

పెరవలి: కొవ్వూరు డివిజన్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్‌గా పెరవలి మండలం కానూరు సర్పంచ్ భావన మధు పూర్ణచందును కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ నియమించినట్టు ఆయన తెలిపారు. ఈయన వైఎస్సార్ సీపీ సర్పంచ్‌గా ఉన్నప్పటికి ఎస్సీ కోటాలో ఈ పదవి వరించిందని అనుకుంటున్నట్లు తెలిసింది. మధుకి ఈ పదవి వరించడంతో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మండలంలోని 18 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు అభినందలు తెలిపారు.

అశ్లీల నృత్యాలపై కేసు

పోలీసుల అదుపులో 13 మంది

కొవ్వూరు: మద్దూరు గ్రామంలో వినాయక చవితి నిమజ్జనోత్సవాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శనపై బుధవారం రాత్రి 13 మందిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. గ్రామానికి చెందిన ఎనిమిది మంది కమిటీ సభ్యులు, ఇద్దరు హిజ్రాలు, వారి సహాయలు ఇద్దరు, సౌండ్ సిస్టమ్‌కి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితులు 13 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు.


ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

తాళ్లపూడి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఆ శాఖ జిల్లా గౌరవ జిల్లా అధ్యక్షుడు జయకర్ పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలోని ఆరు ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో గురువారం సమావేశాలు నిర్వహించారు. త్వరలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం, సభ్యత్వాల సేకరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు క్రాంతి కుమార్, మండల గౌరవ అధ్యక్షురాలు రాజకుమారి, మహిళ అధ్యక్షురాలు కృష్ణవేణి, మండల కార్యదర్శి బి.విజయబాబు, జిల్లా సభ్యులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

దేవరపల్లి: గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుడి ప్రతిమలను భక్తులు ఆయా గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడు విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. అనంతరం చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

ఆంధ్రా సుగర్స్ విరాళం రూ.2 కోట్లు



సీఎంకు చెక్కు అందిస్తున్న సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య

తణుకు అర్బన్: వరద బాధితుల సహాయార్థం ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ సంస్థ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 కోట్లు విరాళం అందజేసింది. సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్య గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అమరావతిలో కలిసి రూ.2 కోట్ల చెక్కును అందజేసినట్లు ఆ సంస్థ తెలిపింది. ఇటీవల వరదల సమయంలో తమ వంతు సాయంగా 10 వేల ఆహార పొట్లాలను పంపిణీ చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు.



తీపర్రు పుష్కర ఘాట్‌లో నీట మునిగిన శివుని విగ్రహం



కానూరు అగ్రహారంలో మునిగిన పామాయిల్ తోట



తీపర్రులోని వరద ముంపులో అరటి తోట



ఓదూరువారి పాలెంలో నీట మునిగిన అరటి తోట

తగ్గని వరద.. వీడని ముంపు



ఉసులమర్రులో ఉగ్ర గోదావరి



కానూరు అగ్రహారంలో ముంపుబారిన వరిచేలు

- ఇంకా నీటిలోనే లంకలు
- గగ్గోలు పెడుతున్న రైతన్నలు

పెరవలి: గోదావరి వరద తగ్గకపోవడంతో ముంపు వీడడంలేదు. పెరవలి మండలంలో 16 కిలోమీటర్లు విస్తరించి ఉన్న గోదావరిలో లంకలు 3 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. గత 4 రోజులుగా వరద తగ్గకపోవడంతో పంటలన్నీ నీటిలో నానుతున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల లబోదిబోమంటున్నారు. ఏటిగట్లపై పశువులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కాలం వెల్లదీస్తున్నాయి. గోదారమ్మ శాంతించకపోవడంతో రైతులు లంక పంటలపై ఆశలు వదులుకున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికి అందినట్లే అంది నీటిపాలవడంతో కన్నీరు పెట్టుకుంటున్నారు. అయితే అరటి, మునగ, బొప్పాయి రైతులు పంట నీటమునిగిపోవడంతో ఏదో విధంగా ఒబ్బిడి చేసుకుందామనే ఆలోచనతో పడవలపై వెళ్లి పంట ఉత్పత్తులను గట్లపై చేరవేస్తున్నారు. కూరగాయల పంటలు మాత్రం వదిలేశారు. అరటి గెలలను ఒడ్డుకు చేర్చుతున్నారు. ప్రస్తుతం గోదావరి ఒక అడుగు తగ్గగా శుక్రవారం ఉదయానికి మరో నాలుగు అడుగులు తగ్గుముఖం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి వరద 14 లక్షల క్యూసెక్కులు వదలడంతో గోదావరి రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. గోదావరి వరద ప్రభావం లంక గ్రామాలైన కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, ముత్యాలవారిపాలెం, ఓదూరువారిపాలెం గ్రామాల్లో పంట నష్టం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

పెరవలి మండలంలో 300 ఎకరాల పంటకు నష్టం

పెరవలి: గోదావరి వరద కారణంగా కొవ్వూరు డివిజన్‌లో వందలాది ఎకరాలు పంట నీటమునిగిందని ముఖ్యంగా పెరవలి మండలంలో 300 ఎకరాల్లో పంటలు నీటమునిగిందని ఉద్యానవన అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. పెరవలి మండలం కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. గోదావరి వరద పూర్తిగా తగ్గినప్పుడే పంట నష్టాలను అంచనా కరెక్టుగా ఉంటుందని ఇప్పుడే ప్రాథమిక అంచనా ప్రకారం 300 ఎకరాలుగా గుర్తించామన్నారు. గోదావరి వరద వలన ముఖ్యంగా కూరగాయ పంటలు, పందిర్లు, బొప్పాయి, మునగ, అరటి, పూల తోటలు, ఆకు కూరలు పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లుతుందని, మిగిలిన పంటలైన పామాయిల్, కోకో, జామ, కొబ్బరి, పంటలకు నష్టం అంతంత మాత్రంగానే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఉద్యాన వన అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



తీపర్రులో నీటమునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి శ్రీనివాస్

ముంపులో గోష్పాద క్షేత్రం



కొవ్వూరులో గోదావరి వరద ముంపులో గోష్పాదక్షేత్రం ఆలయాలు



మద్దూరు హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

- మద్దూరు హైస్కూలులో కొనసాగుతున్న పునరావాస కేంద్రం
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

కొవ్వూరు: గోష్పాదక్షేత్రంలో ఇంకా వరద ముంపులోనే ఉంది. క్షేత్రంలో రోడ్లపై మూడు అడుగుల మేరకు వరదనీరు ప్రవహిస్తోంది. ఆలయాలన్నీ ముంపులోనే ఉన్నాయి. వరద కారణంగా వినాయక విగ్రహాల నిమజ్జనాలకు మరో రెండు రోజుల వరకు వీలు లేనట్టు కనిపిస్తోంది. చిన్న చిన్న విగ్రహాల నిమజ్జనాలకు మాత్రమే అధికారులు అవకాశమిచ్చారు. మద్దూరు హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరం గురువారం కొనసాగింది. పల్లెపాలెంలోని 17 కుటుంబాలకు చెందిన 49 మంది మత్స్యకారులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు అందుతున్న సౌకర్యాలను గురించి ఆరా తీశారు. బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మద్దూరులంక గ్రామం వెళ్లి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, ప్రజలకు సూచించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం గురించి ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మరో వైపు గోదావరి వరద ఉధృతి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తోంది. ఎంపీపీ కాకర్ల నారాయుడు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దూరు సర్పంచు ఉప్పులూరి ముని రాజేంద్రప్రసాద్(బాబ్జీ), నాయుకులు నాయుడు వీర్రాజు, కె.రామకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు 14.80 అడుగులకు చేరింది. భద్రచలంలో స్వల్ప తగ్గుదల కనిపించింది. ధవళేశ్వరంలో కూడా వరద నెమ్మదిస్తోంది. ఆనకట్ట నుంచి 14,38,868 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. ఎగువ ప్రాంతంలో నీటిమట్టాలు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం సాయంత్రానికి ప్రమాద హెచ్చరికలు ఉపసంహరించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. మద్దూరులంక, చిగురులంక, కుమారదేవం, చిడిపి గ్రామాల్లో లంకభూములు ముంపుబారిన పడ్డాయి.

వరద బాధితుల కోసం సరకులు తరలింపు



కొవ్వూరుకు చేరిన వాసవీక్లబ్ వాహనాలు, చిత్రంలో క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు

కొవ్వూరు: వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకుడు కొల్లేపర వెంకటేశ్వరరావు(శ్రీనివాస్) రూ.25వేలు విలువైన బిస్కెట్ ప్యాకెట్ల బాక్సులను విరాళంగా అందజేశారు. వాసవీక్లబ్ తరపున రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు వాసవీక్లబ్ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆ క్లబ్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా ప్రకాష్ ప్రకటించారు. వరద బాధితుల కోసం రెండు లారీల్లో సేకరించిన చీరలు, దుప్పట్లు, కండువాలు, పుస్తకాలు, స్టీలు ప్లేట్లు, గ్లాసులు, ఇతర వంట సామగ్రిని తరలిస్తున్నామన్నారు. ఈ వాహనాలు గురువారం కొవ్వూరు పట్టణానికి చేరుకున్నాయి. స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీక్లబ్ సభ్యులు వారికి స్వాగతం పలికారు. వీటిని విజయవాడలోని వరద బాధితులకు పంపిణీ చేయనున్నట్టు వాసవీక్లబ్ నాయకులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు మద్దుల సత్యనారాయణ, మట్టే ప్రసాద్, వలివేటి ప్రసాద్, నాళం వీరవెంకట శ్రీనివాస్, వంకాయాల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కొవ్వూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలు పోస్టులకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో డి.మమ్మీ తెలిపారు. కొవ్వూరు మండలంలో కుమారదేవం-1 అంగన్‌వాడీ కేంద్రంలో బీసీ-ఏకి, ఆరికిరేవుల-2ను బీసీ-డికి కేటాయించారన్నారు. వేములూరు-3 కేంద్రంలో ఆయా పోస్టుని, ఆరోవార్డు మెహర్‌బాబా గుడి వీధి కేంద్రంలో పోస్టును, 18వ వార్డులో శ్రీరామ సొసైటీ వద్ద కేంద్రంలో ఆయా పోస్టుతో పాటు పెనకనమెట్ట-3 ఆయా పోస్టును ఓపెన్ కేటగిరిలకు కేటాయించామన్నారు. చాగల్లు-4 కేంద్రంలో బీసీ-బీ, చిక్కాల-4 లో ఎస్టీలకు, నెలటూరు-1ను ఓపెన్ కేటగిరి, గౌరీపల్లి-1ను బీసీ-బీకి, చంద్రవరం-2ను బీసీ-ఈకి కేటాయించామన్నారు. తాళ్లపూడి మండలం మలకపల్లి-3ని ఎస్సీలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు.

నల్లజర్ల: మండలంలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ పద్మావతి తెలిపారు. చాదరాసి గుంట-54, నబీపేట-1, నల్లజర్ల-2 ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



తూర్పుచోడవరంలో ఎలుకల నిర్మూలనపై రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నల్లజర్ల: రైతులంతా సామూహికంగా ఎలుకల సమగ్ర యాజమాన్యం పాటిస్తే వరిలో స్థిరమైన దిగుబడి పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. తూర్పుచోడవరంలో గురువారం ఎలుకల నిర్మూలనపై ఆయన రైతులు అవగాహన కల్పించారు. ఆకుముడత, పాముపొడ తెగులు నివారణ మార్గాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టరు చల్లా వెంకటనరసింహరావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు మానుకొండ శ్రీనివాస డీఆర్సీ ఏడీఏ ఎస్ జయరామలక్ష్మి, కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ కమల్‌రాజ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

కొవ్వూరు: సామూహిక ఎలుకల నివారణలో భాగంగా గురువారం ధర్మవరంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు ఎలుకల నిర్మూలన మందుని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.గంగాధరరావు మాట్లాడుతూ 100 గ్రాముల విషపు ఎర తయారీకి రెండు గ్రాముల బ్రోమోడియోలిన్ మందును 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల నూనెలో కలిపి ఎలుకలు తిరిగే బొరియల వద్ద 10 గ్రాముల పొట్లాలు కట్టి పెట్టాలని సూచించారు. ఈ మందు తిన్న ఎలుకలు ఐదు, ఆరు రోజుల పాటు దాహంతో బయటికి వెళ్లిపోయి చనిపోతాయన్నారు. ఎంపీపీ కాకర్ల నారాయణదు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా..

నల్లజర్ల: విజయవాడ వరద బాధితులకు చేసిన సహాయానికి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్లలో క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సేకరించిన విరాళాలు రూ.60లక్షలు డి.డి.రూపంలో సీఎంకు అందజేసినట్టు చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

పెరవలి: బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేమని ఎంపీడీఓ రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ వల్ల మహిళలు ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. తహసీల్దార్ అత్యుతకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అటువంటి వివాహాలు జరిగినట్టు తెలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటిని అరికట్టడానికి గ్రామాల్లో కమిటీలు వేసుకుని నిత్యం పర్యవేక్షణ చేయాలని అందుకు మండల స్థాయి అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. సీడీపీఓ డి.లక్ష్మి మాట్లాడుతూ బాలికలు యుక్త వయస్సులో వచ్చే శరీర మార్పులు గురించి ముందస్తుగా అవగాహన కల్పిస్తే బాలికలు ఆందోళన తగ్గుతుందన్నారు. ఆడపిల్లలపై నిర్లక్ష్యం వద్దని ప్రతి బాలికను ఉన్నత చదువులు చదివించాలని సమాజంలో మంచిచెడుల గురించి అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వ్యవసాయాదికారి మేరీ కిరణ్ సూపర్ వైజర్‌లు బాల సరస్వతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఇన్ కం ట్యాక్స్‌కు రశీదులు సమర్పించాలి

కొవ్వూరు: ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పెన్షన్ తీసుకునే రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల అంతా ఇన్ కం టాక్స్ రాయితీ పొందాలనుకునే వారు ఈనెల 29వ తేదీ లోపు పొదుపు, గృహ రుణాలు, ఎల్ఐసీ, మెడికల్ పాలసీలకు సంబంధించిన రశీదులు సమర్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు సూచించారు. ఏవైనా సందేహాలుంటే పెన్షనర్స్ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు.

శ్రీనివాసనాయుడికి సత్కారం



మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు : పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీపూజ గణపతి కుమార స్వామి వారి ఆలయంలో గణపతి నవ రాత్ర 102వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుని గజమాల, పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, తోలేటి కోటేశ్వరరావు, ముప్పనబోయిన గంగారావు, దుళ్ల మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి: ప్రజా సమస్యలు, అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అదేవిదంగా మ్యూటేషన్‌కు చెందిన రెండు దరఖాస్తులు పెండింగ్‌కు సంబంధించిన వివరాలు పరిశీలించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సకాలంలో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీ ఆర్ఎస్-మీకోసం ద్వారా వస్తున్న అర్జీల పరిష్కార స్థాయిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా-2024 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకూ మూడు కీలక అంశాలతో ప్రజల్లోకి తీసుకుని వెళ్లే క్రమంలో మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఆర్ఐ కిషోర్, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం : 11 కేవీ ఉండ్రాజవరం-తాడిపర్రు ఫీడర్లలో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా ఉండ్రాజవరం, సత్యవాడ, చిలకపాడు, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఏఈ ఎస్.దొరబాబు గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 2 గంటకు ఇచ్చేలా మార్పు చేసినట్టు తెలిపారు.

దేవరపల్లి: స్థనిక సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు డీఈఈ బి.వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిడదవోలు రూరల్: మండలంలోని బసివిరెడ్డిపేట, కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలోని తిమ్మరాజుపాలెం, లింగంపల్లి, శంకరాపురం, రావిమెట్ల, సూరాపురం, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో కూడా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

గోపాలపురం: జగన్నాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న జగన్నాధపురం, కోమటికుంట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. జగన్నాదపురం, కోమటికుంట వ్యవశాయ, గృహ,వాణిజ్య, ఇండస్ట్రియల్ వినియోగదారులు సహకరించాని ఆయన కోరారు.